REGD. NO. A. 40 | విడి ప్రతి 0-3-0 | శుక్రవారం 5-6-59

# జమీన్ రైతు

సంపుటి 31 | సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి | సంచిక 23

## హైదరాబాద్ లేఖ

★ ★ ★ మా విలేకరి ★ ★ ★

## నాగార్జునసాగర్ బోర్డు రద్దయి, ప్రాజెక్టు నిర్వహణ పబ్లిక్ వర్క్సు ద్వారా జరుగుతుందా?

నాగార్జునసాగరం ప్రాజెక్టు బోర్డు త్వరలో రద్దయి, ప్రాజెక్టు నిర్వహణ ఇక పబ్లిక్ వర్క్సుశాఖ ద్వారా జరుగుతుందని తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుంచి, అంటే మూడేళ్లనుంచి బోర్డును రద్దుచేసి, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను తమకు పూర్తిగా ఒప్పజెప్పాలని, రాష్ట్రప్రభుత్వం, కేంద్రానికి వ్రాస్తూ వచ్చింది. చివరికి కృతకృత్యులైందని చెప్పవచ్చును.

ప్రాజెక్టు పరిపాలకుడుగా పనిచేస్తున్న శ్రీ ఎస్. చక్రవర్తి, ఐ. సి. ఎస్., కేంద్ర ప్రభుత్వంలో ముందు జాయింట్ సెక్రటరీగా వున్న వారిని సెక్రటరీగా నియమించబడ్తారనికూడా తెలుస్తున్నది. ఈయన బదులు ప్రస్తుతం, ఎస్. ఏ. అయ్యంగార్ స్థానంలో రివిన్యూబోర్డు మూడవ సభ్యుడుగా పనిచేస్తున్న శ్రీ ఏ. ఆర్. కృష్ణస్వామి ఐ. సి. ఎస్., ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత వహించవచ్చును. ఇతన్ని కూడను ప్రాజెక్టుబోర్డు సభ్యుడుగా నియమించారుకూడా.

1955లో 120 కోట్లు ఖర్చుగాగల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పుడు దాని నిర్మాణం హైదరాబాదు, ఆంధ్ర ప్రభుత్వాలు చేయవలసి వుంటుంది కనుక, అదిలో తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణంలో కలిగినటువంటి ఇబ్బందులు జరగకుండేటందుకై ఉభయ రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, ఆర్థిక, పబ్లిక్ వర్క్సుశాఖ మంత్రులతోను, కేంద్ర జల విద్యుత్ సంఘ ప్రతినిధులతోను ఒక నిర్వాహణబోర్డును చేశారు. ఈబోర్డు క్రింద ఒక నిర్వాహకుని (ఎడ్మినిస్ట్రేటరు) చేశారు. ఇప్పుడు రెండు రాష్ట్రాలు లేక్యముగాలేవు కనుక ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యేకబోర్డు అవసరంలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభిప్రాయపడుతున్నది.

బోర్డును రద్దుచేసిన తరువాత పబ్లిక్ వర్క్సుశాఖకు ఒక అదనపు కార్యదర్శిని చేసి ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను ఆయనకు అప్పగిస్తారు. శ్రీ ఏ. ఆర్. కృష్ణస్వామిని అదనపు కార్యదర్శిగా నియమిస్తారని తెలుస్తున్నది.

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పుండవలసిన వ్యవస్థ గురించేకాక దీనికి సంబంధించిన పెక్కు విషయాలపై కేంద్ర ప్రభుత్వానికీ రాష్ట్ర ప్రభుత్వానికీమధ్య ఏకాభిప్రాయం ఇంకా కుదరవలసివున్నది.

ఈ ప్రాజెక్టుకు అయ్యేఖర్చు అంతా ప్రస్తుతం కేంద్రప్రభుత్వమే రుణంరూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి యిస్తున్నది. ఈ మొత్తాన్ని రుణంగాకాక గ్రాంటురూపంలో ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కోరుతున్నది. ఇందుకు కేంద్రం ఇదివరకు సుముఖంగా లేదు. కుడికాలవను వెల్లూరువరకు తీసికెళ్ళాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ 22,000 క్యూసెక్కులనీరు ప్రవహించటానికి వీలుగా దాన్ని నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం కోరుతుంటే, ఆ కాలవ ఒంగోలు తాలూకా దాటకూడదనీ, అందుకు పది వేలు క్యూసెక్కులనీరు ప్రవహించ గలిగితే చాలనీ కేంద్రం చెబుతున్నది. అయితే కాలవనుమాత్రం 22,000 క్యూసెక్కుల నీరుకు తగినట్లుగానే నిర్మిస్తున్నారు.

నీటిపారుదల మాత్రమేగాక విద్యుదుత్పత్తికూడా ఈ ప్రాజెక్టుక్రింద జరగాలని రాష్ట్ర ప్రభుత్వం వుద్దేశిస్తున్నది. అందుచేత ఈ రెండు దశలకు ఖర్చు అంచనా 120 కోట్లు అవుతుందని తయారుచేశారు. కేంద్రంమాత్రం దీనికి రెండవదశ అంటూ వుంటుందనికూడా అంగీకరించడంలేదు. రెండు కాలువలు, ఆనకట్ట నిర్మాణానికి రూ. 80 కోట్లు అవుతుందనీ, అంతకుమించిన ఖర్చుకోసం ఆర్థికవనరులను చేయవలసిన బాధ్యత తమకులేదనీ కేంద్ర ప్రభుత్వంవారు చెబుతున్నారు.

ఇది ఇలావుండగా దాదాపు పదివేలమంది కార్మికులు నిత్యం పనిచేస్తున్న డాం స్థలం వద్ద శాంతిభద్రతలు దినదినం క్షీణిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి. దేశంలో వివిధ భాగాలనుంచి కార్మికులు, టెక్నీషియనులు ఇక్కడకువచ్చి పనులుచేస్తున్నారు. వీరి వసతికి, నివాసానికి, ఆరోగ్యకరమైన ఏర్పాట్లు లేవు. ఆహారధాన్యాల ధరలు విపరీతంగా హెచ్చు. ఈ దశలో తగాదాలు, పరస్పర కలహాలు కలుగుతుండంలో ఆశ్చర్యంవు దను. ఈ పరిస్థితిని చక్కబెట్టేటందుకై నదికి కుడి పక్కనగల ప్రాజెక్టుప్రాంతంలో పరిపాలనా బాధ్యతను గుంటూరుజిల్లానుంచి, నల్లగొండజిల్లా కలెక్టరుకు ప్రభుత్వం అప్పగించింది. దీనిమీద గుంటూరుజిల్లాలో ఆలజడి ప్రారంభమైంది. ప్రాజెక్టు హెడ్ వర్క్సు తమ జిల్లాలో లేకపోతే, ప్రాజెక్టునుండు ఉపయోగం విషయంలో నూడువచ్చే పేచీల్లో తమది క్రిందిచేయి అవుతుందని ఈ జిల్లా ప్రతినిధులు భావిస్తున్నారు.

—— (1-6-1959)

## చంద్రమౌళిగారికి మంత్రిత్వం

శ్రీ కల్లూరు చంద్రమౌళిగారు మంత్రిగా తీసుకోబడటం ఖాయమనే వదంతులు తిరుగా వినిపిస్తున్నవి. అల్లూరి సత్యనారాయణరాజుగారు సంధానం జరిపారని, తీసుకొనుటకు సంజీవరెడ్డి, చేరుటకు చంద్రమౌళి గారలు అంగీకరించారనికూడా అంటున్నారు.

* * *

## కొత్తపేటలో కాంగ్రెస్ విజయం

కొత్తపేట నియోజకవర్గ ఉపఎన్నికలో కమ్యూనిస్టు అభ్యర్థి ఘనంగా పరాజయం పొందాడు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ మంతెన వెంకటసూర్య సుబ్బరాజుగారు 13వేల మెజారిటీతో ఎన్నుకోబడ్డారు. దివంగతుడైన కళా వెంకటరావుగారి కీర్తిని నిలబెట్టారు కొత్తపేట ఓటర్లు.

## కమ్యూనిస్టుల ప్రజాస్వామ్యం!

### రాష్ట్రసంఘ ఆదేశానుసారం జిల్లాకార్యదర్శి వూడబెరకబడ్డాడు!

గత 21, 22, 23 తేదులలో జరిగిన నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు కమిటి అనేక యితర తీర్మానాలతో పాటు యీ క్రింది తీర్మానం గావించింది.

"ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుసమితి తీర్మానానుసారం జి. యల్లమందారెడ్డిగారిని జిల్లాపార్టీ బాధ్యతలను తప్పించి, బి. శంకరయ్యగార్ని జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శిగా ఏకగ్రీవముగా ఎన్నుకోవడమైనది."

కమ్యూనిస్టు సంఘాలకు ఎంత స్వేచ్ఛ వుండేది, ఎంత ప్రజాస్వామిక సూత్రానుగుణంగా అవి నడుస్తుండేది తెలుసుకొనుటకు వేరొక సాదృశ్యం అవసరం లేదను కుంటాము

నిర్మల స్పెషల్ * * *

కాపీపొడి - వక్కపొడి

❖ కాపీ గింజలు వేయించినవి

పచ్చివి అమ్మబడును

నిర్మల కాఫీవర్క్సు

ట్రంకురోడ్డు — నెల్లూరు

# వార్తలు-వ్యాఖ్యలు

## కేరళ పరిస్థితి

జూన్ మొదటి తేది నుండే విద్యాచట్టాన్ని అమలు జేస్తున్నామని కేరళ ప్రభుత్వం ఎంతగా బింకాలు పలుకుతున్నా, కేరళ ప్రతిపక్షాల ఉద్యమాన్ని చూచి ప్రభుత్వం భయపడి, వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభాన్ని మరో పక్షంరోజులు, అంటే జూన్ 15 తేదికి, వాయిదా వేయక తప్పింది కాదు. బహుశా ఈసరి పర్యాయానికే ప్రభుత్వం యీ ఎత్తుగడ వన్ని వుంటుంది. వాయిదా వేసినంత మాత్రాన బయలుదేరిన ఈ ఉద్యమం విరమించబడదు; అది అనుకున్నట్లు జరిగి తీరేట్లున్నది. ఈనాడు కేరళ విద్యాచట్టం, ఆందోళన కారణాలలో ముఖ్యమైనది కావచ్చునేమో గాని, కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారంలో వుండడం యింకెంతమాత్రం కేరళ ప్రజలు సహించే స్థితిలో లేరు. కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వమును ప్రజలు ఎంతగా ఏవగించుకుంటున్నారో, చంగనచెర్రిలో జరిగిన రెండులక్షలమందితో కూడిన బహిరంగసభయే ప్రత్యక్షనిదర్శనం. కేథలిక్కులు-నాయర్ సంఘం విద్యాచట్టాన్ని విరమించుకోమని కోరడం, కేరళ ప్రదేశ కాంగ్రెస్ చార్జిషీటు పెట్టడం — యివి కేరళ ఉద్యమ ప్రత్యక్ష కారణాలుగా కనిపించవచ్చు. కాని కమ్యూనిస్టు మంత్రివర్గంచేత రాజీనామా యిప్పించడం—యీ వుద్యమ పరోక్ష లక్ష్యం. ఈ లక్ష్యం సిద్ధించేవరకు కేరళ ఉద్యమం విరమించబడే సూచనలు లేవు. ఈ ఉద్యమానికి కేరళ ప్రజల అండదండలేగాక, ప్రధాని శ్రీ నెహ్రూ, కాంగ్రెసు అగ్రనాయకుల ఆశీర్వాద బలంకూడా కలదు. అంతేకాదు, రాజ్యాధికారంనుండి కమ్యూనిస్టు ప్రభుత్వం తొలగిపోవడం అందరి సమాశయం కాబట్టి కేరళలోని కమ్యూనిస్టేతర రాజకీయ పక్షాలన్నింటి మద్దతు వుండగలదనుటలో ఎట్టిసందేహం లేదు. ప్రతిపక్షాల ఉద్యమం సాఫల్యం పొందగలదనే అందరూ ఆశిస్తున్నారు.

కేరళలో రాజ్యాధికారంలో వుండడమా లేక ఊడడమా అనేది నేడు కమ్యూనిస్టు పార్టీని ఎదుర్కొంటున్న సవాల్. నంబూద్రిపాద్ రాజీనామా యివ్వకపోతే కల్లోలం, అరాజకం ఏర్పడగలదనిపిస్తున్నది. సచివాలయాన్ని ప్రజలు చుట్టుముట్టాలనే ప్రయత్నాలుకూడ లేకపోలేదు. పోలీసు శాఖను కృష్ణయ్యర్ బదులు అచ్యుతమీనన్ నిర్వహించినా, పోలీసు అధికారుల బదిలీలు జరిగినా, మలబారు స్పెషల్ పోలీసును ప్రజలపై ఉపయోగించదలచినా, ప్రజల అసంతృప్తి చల్లారదు; కేరళ ఉద్యమం ఆగదు. కేరళను కల్లోలాన్నుండి కాపాడాలంటే, నంబూద్రిపాద్ మంత్రివర్గం రాజీనామాచేసి, మళ్లీ ఎన్నికలు జరిపించడమే మార్గాంతరంగా కనుపిస్తున్నది.

## ముంద్రాబేరం: ప్రభుత్వ నిర్ణయం

ముంద్రాకు, జీవిత భీమాసంస్థకు సంబంధించి వాటాల కొనుగోలు బేరంలో జరిపిన కుంభకోణంమీద భారత ప్రభుత్వం చేసిన నిర్ణయం ఆశ్చర్యకరంగావుంది. ఏదో కొండ తవ్వి ఎలుకను పట్టిన చందంగా, ముంద్రా కుంభకోణంలో అధికారులపాత్ర విషయం తన్నుకపోయింది. అధికారుల పాత్రను గురించి విచారించిన వివియన్ బోస్ కమిటీ నివేదికను భారత ప్రభుత్వం త్రోసిపుచ్చి, పర్వీన్ కమిషన్ సిఫారసులను ఆమోదించింది. శ్రీ హెచ్. యం. పటేల్ పైచేసిన ఆరోపణలు రుజువు కాలేదన్న పర్వీన్ కమిషన్ వాదనను ప్రభుత్వం అంగీకరించింది; జీవిత భీమా కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీ కామత్ నుకూడ మందలించి వదలిపెట్టారు. మేనేజింగ్ డైరెక్టర్ వైద్యనాథన్ విషయం చూడవలసిందిగా జీవిత భీమా కార్పొరేషన్ కోరబడింది. మొత్తంమీద ప్రభుత్వ నిర్ణయాలు చూస్తే ముంద్రా కుంభకోణానికి ఎవ్వరి బాధ్యత లేనట్లు ప్రభుత్వం భావించినట్లున్నది. ముంద్రా కుంభకోణం గురించి, చాగ్లా కమిషన్, వివియన్ బోస్ సంఘం సుదీర్ఘమైన విచారణ జరిపారు. ఈ ముంద్రా బేరంలో వ్యాపార నియమాలు పాటించబడలేదన్న విషయంతప్ప, అసలు యీ బేరంలోని పూర్తి కుంభకోణం వెల్లడి కాలేదని ప్రభుత్వంకూడ, చాగ్లా కమిషన్, బోస్ సంఘాలవలెనే, అభిప్రాయపడినట్లున్నది. బోస్ సంఘం అభిప్రాయాలన్నిటితో మనం ఏకీభవించలేకపోవచ్చు గాని, పర్వీన్ కమిషన్ సిఫారసులతో కూడ ఏకీభవించలేకున్నాము. మార్కెట్ ను చక్కబరచడానికి జీవితభీమాసంస్థల నిధులను ఉపయోగించడం ప్రభుత్వ విధాననియమం కాగా, ఆ విషయం తత్సంబంధమైన మంత్రి దృష్టికి తీసుకరాకపోవడంలో అధికారులు తప్పు చేశారనేది సుస్పష్టం. ఈ విషయంలో ప్రభుత్వం సూటిగా వ్యవహరించలేదనే చెప్పవలసి వుంటుంది. పటేల్ కామత్ లు మరలా ఉద్యోగంలో చేరేందుకు ఈవిధంగా వీలౌతోందేమో ననిపిస్తున్నది. ఏపాపము ఎరుగని కృష్ణమాచారి నిందలపాలు కావడం ఈ వ్యవహారంలో అసలు దోషులు తప్పించుకోవడం జరిగింది.

# కృష్ణమాచారి నిందపాలైనారు- దోషులు తప్పించుకున్నారు!

## ఉదకమండలం గోష్ఠి

ఉదకమండలంలో, తృతీయ ప్రణాళిక

...మీద అఖిలభారత కాంగ్రెసు సంఘంవారు చర్చాగోష్ఠిని ఏర్పాటుచేశారు. ఈ గోష్ఠిని ప్రారంభిస్తూ భారత ప్రధాని శ్రీ నెహ్రూ సిద్ధాంతాలను అవలంబించి, శాస్త్రీయమైన ఆచరణయోగ్యమైన ధోరణిని అవలంబించడం గొప్ప విషయం. సోషలిస్టు సమాజాన్ని సాధనకు తృతీయ ప్రణాళిక ఒక సాధనంగావాలనే వుండి దృష్టితో విశదమైన ప్రతిపాదనలు చేసేబదులు, మనకున్న అవకాశాలు, వనరులతో మన సమాజాభ్యుదయ కార్యక్రమాన్ని రూపొందించుకోవడం అవసరమని శ్రీ నెహ్రూ చెప్పడం ఎంతో సముచితంగావుంది. కొన్ని పరిధులను దాటి ప్రజలను బలవంత పెట్టరాదని శ్రీ నెహ్రూ చేసిన హెచ్చరికకూడ గమనించదగిన విషయం. ప్రణాళికాగత అభివృద్ధి కార్యక్రమంలో, కొన్ని నిర్బంధాలవసరమే కాని, ఏటా నూటికి 4 లేక 6 వంతుల కొద్దిపాటి జాతీయాదాయం మాత్రమేకల మన ఆర్థిక వ్యవస్థ ఎక్కువ పన్నులభారాన్ని మోయలేకున్నది. పేదలు, మధ్యతరగతుల

—తరువాత 10-వ పేజీలో

## దాల్మియాకు జైలు శిక్ష

కోటీశ్వరుడు, గొప్ప పారిశ్రామిక వేత్త, 66 ఏండ్ల వయస్సుగల శ్రీ రామకృష్ణ దాల్మియా, ఇన్సూరెన్సు కంపెనీ ధనం దుర్వినియోగం చేశాడనే ఆరోపణపై, ప్రత్యేక న్యాయమూర్తిచే రెండేళ్ళ జైలుశిక్ష విధించబడ్డాడు.

ముంద్రాలు, దాల్మియాలు, జైనులకాలం పోయింది. న్యాయచట్టానికి సామాన్యుడు ధనాఢ్యుడు యిద్దరూ ఒకటిగానే వున్నారు. ప్రజాస్వామ్యం ప్రసాదించిన సద్యఃఫలితాలలో యిదొకటి.

# కమ్యూనిస్టు మంత్రివర్గ రాజీనామా ఒక్కటే కేరళ సమస్యాపరిష్కారానికి మార్గం!




వేసవిలో చల్లదనానికి....

చేనేత వస్త్రాలు ధరించండి

మన తాత ముత్తాతలు కూడా వేసవిలో చల్లదనానికి చేనేత వస్త్రాలు ధరించేవారు. చందేరి చీరలు, మృదువైన మస్లినులు, ఎన్నో రంగులలో తయారయే 'ముదికట్టు' వస్త్రాలు, దోరియాలు— ఎన్నో! అన్నీ చల్లదనాన్నిచ్చే తేలిక దుస్తులుగా ఉపయోగించవచ్చు.

సరసమైన ధరలకు శ్రేష్ఠమైన వస్త్రాలు

చేనేతవస్త్రాలపై నాణ్యపుగుర్తులు వేయడానికి, ఎగుమతికోసం ముద్రలు వేయడానికి త్వరలోనే ఏర్పాట్లుచేయబడుతాయి, వివరాలకు ఈ క్రిందివారికి వ్రాయండి:

ఆల్ ఇండియా హేండ్ లూమ్ బోర్డు

షాహిబాగ్ భవనం, విట్టల్ రోడ్, బొంబాయి-1

